బియ్యం అక్రమ రవాణా చేస్తే చర్యలు

- పక్కాగా రేషన్ పంపిణీ ప్రక్రియ
- దీపం కింద 4,72,851 మందికి లబ్ధి
- ప్రజాశక్తితో జిల్లా పౌరసరఫరాల అధికారి రాజా రఘువీర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రేషన్ బియ్యాన్ని అక్రమంగా ఎవరైనా తరలిస్తే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజా రఘువీర్ హెచ్చరించారు. రేషన్ బియ్యం తరలింపుపై తమకు సమాచారం ఇస్తే తప్పనిసరిగా దాడి చేసి 6ఏ కేసులను నమోదు చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో ప్రతి నెల రేషన్ కార్డుదారులకు పక్కాగా రేషన్ పంపిణీ ప్రక్రియను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న దీపం పథకం కింద 4,72,851 మంది గ్యాస్ వినియోగదారులకు పథకం లబ్ధి చేకూరుతోందన్నారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు..

లబ్ధిదారులకు రేషన్ సరుకుల పంపిణీ పక్కగా జరుగుతోందా? లేదా?

డిఎస్ఓ : జిల్లాలో మొత్తం 6,76,300 రేషన్ కార్డులు ఉన్నాయి. 1233 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ప్రతి నెల ఒకటో తేదీ నుండి 409 ఎండియు వాహనాల ద్వారా కార్డుదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నాం. లబ్ధిదారులు నేరుగా రేషన్ ఎండియూ వాహనాల దగ్గరకు వెళ్లి రేషన్ బియ్యం, చక్కెర, కందిపప్పు, జొన్నలు తీసుకోవచ్చు. కార్డుదారులకు ఇబ్బంది లేకుండానే ప్రతి నెల పక్కాగా రేషన్ పంపిణీపై దృష్టి సాధించడం జరుగుతుంది.

జిల్లాలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోతుంది? దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డిఎస్ఓ : రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై చాలా కఠినంగానే వ్యవహరించడం జరుగుతుంది. రాష్ట్ర ఉన్నతాధికారులు కూడా దీనిపై చాలా సీరియస్‌గానే ఉన్నారు. రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై ఎక్కడైనా జరుగుతుంటే వెంటనే సంబంధిత వాహనాలను సీజ్ చేసి 6 ఏ కేసులు పెట్టాలని కింది స్థాయి అధికారులు కూడా ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఎవరైనా తమకు నేరుగా ఫోన్ చేసి సమాచారం ఇస్తే నేరుగా వెళ్లి పట్టుకుంటాం.

జిల్లాలో ఎన్ని కొత్త రేషన్ షాపులు ఏర్పాటు చేస్తున్నారు? డీలర్ల భర్తీ ప్రక్రియ ఎలా నిర్వహిస్తున్నారు?

డిఎస్ఓ : జిల్లాలో మొత్తం 201 రేషన్ షాపుల భర్తీకి జిల్లా కలెక్టర్ ద్వారా అనుమతి పొందడం జరిగింది. ఇందులో ఖాళీగా ఉన్నటువంటివి 118 రేషన్ షాపులు కొత్తగా 83 రేషన్ షాపులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయడం జరిగింది. సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి నుండి ఇప్పటికే నోటిఫికేషన్ కూడా విడుదల చేశారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కూడా రాత పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నారు.

జిల్లాలో దీపం పథకం కింద ఎంత మందికి లబ్ధి చేకూరుతుంది? ఈ పథకం అమలుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డిఎస్ఓ : ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లను దీపం-2 పథకం కింద గ్యాస్ లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తుంది. మన జిల్లాలో 4,72,851 గ్యాస్ వినియోగదారులకు ఈ పథకం కింద ఉచిత సిలిండర్ పొందుతారు. గ్యాస్ వినియోగదారుడు ఈ పథకం కింద గ్యాస్ బుక్ చేసుకోగానే వెంటనే వారికి గ్యాస్ డెలివరీ అయిన వెంటనే నేరుగా బ్యాంకు ఖాతాకి నగదు జమ చేయడం జరుగుతుంది. ఎవరైనా లబ్ధిదారులకు ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకొని వస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

ఎ(బ)రువు...



- రసాయన ఎరువుల ధరలు పెంచిన కంపెనీలు
- బస్తాపై రూ.100 నుంచి రూ.200 వరకూ పెంపు
- అన్నదాతలపై మరింత భారం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఆరుగాలం కష్టించి సాగు చేసినా కనీసం పెట్టుబడి కూడా మిగలని పరిస్థితిలో ఉన్న అన్నదాతలకు ఎరువు మరింత భారంగా మారింది. రసాయన ఎరువుల ధరలను బస్తాపై రూ.100 నుంచి రూ.200 వరకూ ఆయా కంపెనీలు పెంచడంతో అన్నదాతలకు ఎరువుల పిడుగు పడింది...

ఒక వైపు అధిక వర్షాలు.. మరో వైపు వర్షాభావ పరిస్థితులతో రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై ఎరువుల ధరలు పెంచడం పట్ల అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు సప్లయ్ ప్లాన్ ప్రకారం జిల్లాకు ఎరువులు కూడా రావడం లేదు. ఉమ్మడి జిల్లాలో ఏటా దాదాపు 5 లక్షల టన్నుల రసాయన ఎరువులు వినియోగిస్తు న్నారు. 50 కిలోల ఎరువు బస్తాపై కనిష్టంగా రూ.100 నుంచి రూ.200 వరకు పెంచింది. 20 బస్తాలైతే ఒక టన్ను. ఈ లెక్కన టన్నుపై గరిష్టంగా రూ.2 వేలు పెరిగింది. త్వరలో డిఎపి ధర కూడా భారీగా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎరువుల కంపెనీలు ధరలను అడ్డగోలుగా పెంచుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో రబీ సాగుకు రసాయనిక ఎరువుల వినియోగం ఎక్కువగా ఉంటుంది. ధరల పెరుగదలతో అన్నదాతలపై మరింత భారం పడనుంది. రసాయనిక ఎరువుల ధరలు గతంలో రకాన్ని బట్టి రూ.1100 నుంచి రూ.1680 వరకూ ఉండగా ప్రస్తుతం ఆ ధరలు రూ.1300 నుంచి రూ.1800కు పెరిగాయి. మరో వైపు వ్యాపారులు రసాయనిక ఎరువులను అధిక ధరలకు వినియోగిస్తూ దోచుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో మొక్కజొన్న, మినుము, జొన్న, శనగ తదితర పంటలను సాగు చేస్తారు. దుక్కిలో వేసేందుకు డీఏపీ, యూరియా అవసరం. మార్కెట్లో ఎంఆర్‌పి కంటే ఎక్కువ ధరలకు వ్యాపారులు విక్రయిస్తుండటంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. నానో డిఎపి, నానో యూరియా తీసుకోవాలని ఒత్తిళ్లు తెస్తున్నారు. ఇవి తీసుకోకపోతే 50 కిలోల యూరియా బస్తా రూ.1,350 ఉంటే రూ.1,430లకు విక్రయిస్తున్నారు. నానో యూరియా సీసా రూ.252 ఉంటే రూ.300 నుంచి రూ.810కు అమ్ముతుండటంతో కొందరు రైతులు ఆవసరం ఉన్నా.. లేకపోయినా నానో డిఎపి, నానో యూరియా తీసుకుంటు న్నారు. వ్యాపారులు తమ లక్ష్యాల సాధనకుగాను రైతులపై భారం వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. 20- 20., 28-28, 14-35-14, 15-15-15, 19-19-19, 16-16-16, 10-26-26 ధరలను కూడా వ్యాపారులు విపరీతంగా పెంచేశారు. 50 కిలోల బస్తా విపణిలో రూ.1,300 ఉంటే రూ.1,470 వరకు విక్రయి స్తున్నారు. కొందరు డీలర్లు పాత నిల్వలపైనా కొత్త ధరలు వేసి రైతులకు అంటగడుతున్నారు. తక్కువ ఖర్చుతో పంటలకు పోషకాలు అందించే ఎరు వులను విరివిగా అందు బాటులో ఉంచాల్సి ఉండగా ఆ దిశగా ఎలాంటి ప్రయత్నాలు చేయ డం లేదు. అధి కారులు సైతం ముమ్మర తనిఖీలు చేసి అక్రమాలను అడ్డుకోవాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

పెరిగిన ధరలు ఇలా (రూపాయల్లో)..

ఎరువు రకం	పాత ధర	కొత్త ధర
28-28-0	1680	1800
14-35-14	1680	1800
20-20-0-13	1100	1300
10-26-26	1370	1470
16-20-0-13	1150	1250

విద్యార్థినులకు రక్షణ కల్పించాలి

- ఎస్ఎఫ్ఐ బాలికల సమావేశంలో పి.నిర్మల

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మాట్లాడుతున్న శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల

ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థినులకు రక్షణ కల్పించాలని శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి. నిర్మల, కర్నూలు జిల్లా ఎస్ఎఫ్ఐ మహిళ కన్వీనర్ కె.సంయుక్త ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా బాలికల కన్వెన్షన్ జిల్లా కార్యాలయంలో నగర నాయకులు పావని అధ్యక్షతన నిర్వహించారు. పి.నిర్మల, కె.సంయుక్త మాట్లాడుతూ రోజురోజుకీ ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థినులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. ఇప్పుడిప్పుడే తల్లిదండ్రులు విద్యార్థినులను చదువుకోవడం కోసం పంపుతుంటే అంతలోనే విద్యాసంస్థల్లో లైంగిక దాడులు, హత్యాచారాలు జరుగుతున్నా యన్నారు. తల్లిదండ్రులు విద్యార్థినులను చది వించాలంటే భయంకరమైన పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి ప్రభుత్వ విద్యాసంస్థల దగ్గర విద్యార్థినులకు రక్షణగా వాచ్మెన్లను ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థినుల పట్ల లైంగిక వేధింపులు చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. వాచ్మెన్లను ఏర్పాటు చేయడం ద్వారా అల్లరి మూకల నుంచి విద్యార్థినులకు రక్షణ కల్పించిన వాళ్ళు అవుతారన్నారు. విద్యార్థినుల అక్షరాస్యతను పెంచాలంటే వారికి రక్షణ కల్పించాలన్నారు. విద్యార్థినులను చదువుకు దూరం చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా బాలికల కన్వీనర్ గా సంయుక్త, కో-కన్వీనర్లుగా పావని, శ్రీవాణి, పదిమంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

సూర్యనారాయణ ఆశయాలను కొనసాగిస్తాం

- వర్ధంతి సభలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కీర్తిశేషులు సూర్యనారాయణ ఆశయాలను కొనసాగిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల అన్నారు. కర్నూలు కార్పొరేషన్ కల్లూరు సూర్య నారాయణ భవన్‌లో సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో పి.సూర్యనారాయణ 37 వర్ధంతి సభ సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్. సాయిబాబా అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సూర్య నారాయణ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి. నిర్మల జిల్లా కార్యదర్శి డి .గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ, నగర కార్యదర్శి టి.రాముడు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ బేతంచెర్ల సిమెంట్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తూ కార్మికుల సమస్యలపై నిరంతరం పని చేశారని, చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న వ్యవసాయ కార్మికులు, రైతులు, రైతు కూలీల కోసం అనేక పోరాటాలు చేసి సూర్యనారాయణ పేరు ప్రఖ్యాతలు గడించారన్నారు. భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న సూర్యనారాయణ అంచలంచెలుగా ఎదిగారని తెలిపారు. ఎదుగుదలను ఓర్వలేని కాంగ్రెస్ గుండాలు తమకు అడ్డుగా ఉంటాడనే కక్షతో ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అనుచరులు బాంబులతో దాడిచేసి చంపించారని తెలిపారు. కార్మికులు, రైతులు, రైతు కూలీలు కష్ట జీవుల పక్షాన నిరంతరం కృషి చేసిన సూర్య నారాయణను ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకొని ఆయన ఆశయాలను కార్యకర్తలు ముందుకు తీసుకువెళ్లా లన్నారు. ప్రస్తుత బిజెపి ప్రభుత్వం ఒకే దేశం ఒకే ఎన్నిక పేరుతో నరేంద్ర మోడీ రాష్ట్రాలకు హక్కులు లేకుండా హరించే ప్రయత్నం చేస్తున్నారని విమ ర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం పోరాడుతుందని తెలిపారు. నగర కార్యదర్శి టి.రాముడు మాట్లాడుతూ ఈనెల 10న విద్యుత్ చార్జీలు తగ్గించాలని విద్యుత్ సౌదా దగ్గర ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 8న విశాఖపట్నానికి వస్తున్న నరేంద్ర మోడీ గో బ్యాక్ అంటూ 7న కర్నూలు నగరంలో జిల్లా పరిషత్ నుండి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖ పట్టణానికి వస్తున్న నరేంద్ర మోడీ విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయబోమని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సంక్రాంతి సందర్భం గా జరుగుతున్న ఆటల పోటీలను జయప్రదం చేయాలని, జనవరి,ఫిబ్రవరి నెలలో జరగబోయే పార్టీ నిధి సేకరణలో కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుధాకరప్ప, ఆర్.నరసింహులు, కె.ప్రభాకర్, సూర్య నారాయణ ట్రస్ట్ మెంబర్ రమణ మూర్తి, సూర్యనారాయణ భార్య రామసుబ్బమ్మ, కూతురు సుజాత అల్లుడు మారుతి, నగర కమిటీ సభ్యులు ఎస్.మహమ్మద్ రఫీ, ఏసు, శంకర్, రామకృష్ణ. ఎంసి ఆనంద్, గోవిందు, శ్రీనివాసులు, షంషీర్, లక్ష్మయ్య, రెహమాన్, మహిళలు రమణమ్మ, శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్

పరీక్ష కేంద్రంలో తనిఖీలు చేస్తున్న ఆర్‌డిఒ సందీప్ కుమార్

రేషన్ డీలర్ల ఎంపిక పరీక్ష ప్రశాంతం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు రెవెన్యూ డివిజన్ పరిధిలో 74 రేషన్ దుకాణాల భర్తీకి ఆదివారం ఎంపికకు రాత పరీక్ష నిర్వహించారు. నగరంలోని మాంటిసోరి పాఠశాలలో జరిగిన ఈ పరీక్షకు 625 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్ష నిర్వాహణను కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, డిఎస్ఒ రాజా రఘువీర్, కర్నూలు అర్బన్ తహశీల్దార్ వెంకటలక్ష్మి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ అభ్యర్థుల జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి 1:5 ప్రకారం ఇంటర్వ్యూలకు పిలుస్తామన్నారు. సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించిన అనంతరం నియామక పత్రాలను అందజేస్తామన్నారు.

ఈ తాండ్రపాడు సమస్యలు పరిష్కరించండి

- ఎంపీకి సర్పంచి బాలపీర విజ్ఞప్తి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు మండలం ఈ.తాండ్రపాడు గ్రామంలో సమస్యలను పరిష్కారించాలని సర్పంచి ఎస్.బాలపీర, సిపిఎం మండల కార్యదర్శి పిబి హుస్సేనయ్య ఎంపి బస్తిపాటి నాగరాజుకు ఆదివారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో మంచినీటి సమస్య ప్రధానంగా ఉందన్నారు. దీని పరిష్కారం కోసం గతంలో పంచలింగాల బ్రిడ్జి అవతల నుండి ఈ.తాండ్రపాడులోని ఇంటింటికి కుళాయి ఏర్పాటు లక్ష్యంగా జల్ జీవన్ మిషన్ పథకం కింద రూ.70 లక్షల 50 వేలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కాంట్రాక్టర్ ఎవరు ముందుకు రాకపోవడంతో ఆ డబ్బులు వెనక్కి మల్లాయన్నారు. వాటితోపాటు మరిన్ని నిధులు కేటాయించి మా గ్రామానికి జల్‌జీవన్ మిషన్ ద్వారా సురక్షితమైన మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఇందిరమ్మ కాలనీలో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్‌ను నిర్మించాలని, ఎస్‌సి కాలనీలో శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంకును తొలగించి నూతనంగా మరొక ట్యాంకును ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామ వార్డు నెంబర్ కెటి. వెంకటేశ్వర్లు, ఎస్.గోపాల్, బి.మునిస్వామి, బి. నాయుడు, పంచలింగాల కె.నాగరాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచి బాలపీరా, సిపిఎం నాయకులు పిబి హుస్సేనయ్య

విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్‌టిసికే ఇవ్వాలి

- ప్రయివేటుకిస్తే ఉద్యోగాలు పోతాయి
- కొత్తవారికి అవకాశాలుండవు
- 7న విజయవాడ సెమినార్‌ను విజయవంతం చేయాలి
- ఎస్‌డబ్ల్యుఎఫ్, సిఐటియు నాయకుల పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కొత్తగా వస్తున్న విద్యుత్ బస్సులను ఆర్‌టిసి సంస్థద్వారా నిర్వహించాలని , ప్రయివేటుకు ఇవ్వరాదని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కోశాధికారి జె.దివాకర్, రీజినల్ కార్యదర్శి విఎస్.రాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. విజయవాడ ఆర్‌టిసి హౌస్‌లో ఈనెల 7న ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే విద్యుత్ బస్సు సెమినార్లో ఎక్కువ మంది నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆదివారం కర్నూలు కార్మిక కర్షక భవన్ సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెంబర్ 88ని 11/12/24 ద్వారా 2029 నాటికి 100శాతం ఆర్‌టిసి బస్సులు విద్యుత్ బస్సులుగా మార్చాలని ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. పిఎం-ఈ బస్సు సేవా పథకం ప్రకారం ఎపిలోని 11 ప్రధాన నగరాలలో 750 విద్యుత్ బస్సులు ప్రవేశపెట్టాలని ప్రపోజ్ చేస్తూ డిప్యూటీ సిఎం ఇడి పిటిఒ లకు 11/ 12 /24న ఒక లెటర్ ఇచ్చారన్నారు. దీనిని స్వాగతిస్తున్నామని ప్రయివేటుకు ఇస్తే ఆర్‌టిసికి, సమాజానికి నష్టం జరుగుతుందని తెలిపారు. ఈ పాటికే ఆర్‌టిసిలో ఉన్న 11,216 బస్సులలో 2,751 బస్సులు అద్దె బస్సులు ఉన్నాయన్నారు. ఈ అద్దె బస్సులలో 100 బస్సులు విద్యుత్ అద్దె బస్సులు కూడా ఉన్నాయన్నారు. ఈ 100 బస్సులలో ఒక్క ఆర్‌టిసి ఉద్యోగి కూడా పనిచేయడం లేదన్నారు. అంతా ప్రైవేటు వ్యక్తులే ఉన్నారన్నారు. ప్రస్తుతానికి రాబోయే 750 విద్యుత్ బస్సులు కూడా ప్రైవేటు వ్యక్తులే నిర్వహిస్తారన్నారు. 750 బస్సులు వస్తే మొత్తం 3,700 వరకు ఆర్టీసీ ఉద్యోగులు, డ్రైవరు, మెకానిక్, కండక్టర్లు మిగులుగా తేల్చుతారన్నారు. వారికి ఉద్యోగ భద్రత ఉండదన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా, విద్యుత్ బస్సులను ఆర్‌టిసి ద్వారా నిర్వహిస్తే ఇవన్నీ ప్రభుత్వ బస్సులు అవుతాయన్నారు. ఆర్‌టిసిలో ప్రస్తుతం అత్యంత నైపుణ్యం గల డ్రైవర్లు, 129 డిపోల గ్యారేజీలలో , నాలుగు వర్క్ షాపులలో నైపుణ్యంగల, అంకిత భావంతో పనిచేసే సిబ్బంది ఉన్నారన్నారు. గుంటూరు డిపోలో ఒక డీజిల్ బస్సును విద్యుత్ బస్సుగా మార్చి విజయవంతంగా తిప్పిన చరిత్ర ఆర్‌టిసి సిబ్బందికి ఉందన్నారు. విద్యుత్ బస్సులను ఆర్‌టిసి నిర్వహిస్తే మన్నికతో పాటు తయారీ ఖర్చు కూడా తగ్గుతుందని తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించే అవకాశం ప్రభుత్వానికి వస్తుందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి,బిసిలకు రిజర్వేషన్లు అమలు అవుతాయని చెప్పారు. అలా కాకుండా 2029 నాటికి అన్ని ప్రైవేటు విద్యుత్ బస్సులే వస్తే ఆర్‌టిసి ఉద్యోగుల ఉద్యోగాలకు భద్రత ఉండదని తెలిపారు. ప్రజలకు కూడా దీనివల్ల చార్జీల భారం పెరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పుడు ఆర్టీసీలో ప్రమాదాల రేటు 0.08 గా ఉందని, ఇది అత్యంత తక్కువ అని తెలిపారు. కానీ ప్రైవేటు బస్సులు వస్తే ప్రమాదాలు పెరిగే అవకాశం ఉందని చెప్పారు. ప్రస్తుతం ఆర్‌టిసిలో ఉన్న 7,410 బస్సులతో 25 శాతం వరకు స్క్రాప్ దశకు చేరుకొని ఉన్నాయని, ఉగాది నుంచి మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశ పెట్టబోతున్నదని, దీనికై అదనంగా 2,000 బస్సులు , పదివేల మంది సిబ్బంది అవసరం అవుతారని చెప్పారు. ప్రస్తుతం కొనబోతున్న 750 విద్యుత్ బస్సుల బదులుగా డీజిల్ బస్సులే కొంటే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. ఒక విద్యుత్ బస్సుకు ఐదు డీజిల్ తో నడిచే సూపర్ లగ్జరీ బస్సులు లేదా ఎనిమిది ఆర్డినరీ బస్సులు వస్తాయన్నారు. విద్యుత్ బస్సులు ప్రవేశపెడితే వాతావరణ కాలుష్యం తగ్గుతుందని చెప్పటం సరికాదన్నారు. మనదేశంలో వాతావరణలో 50శాతం పరిశ్రమల నుంచి వస్తే, కేవలం 25 శాతం మాత్రమే వాహనాల నుంచి వస్తుందని అన్నారు. వాహనాలలో టూ వీలర్స్, కార్లు, జీపులు, ఆటోలు, లారీలు మొదలగునవి భారీ సంఖ్యలో ఉన్నాయన్నారు. కేవలం బస్సుల ద్వారా వచ్చే వాతావరణ కాలుష్య శాతం 0.69 అన్నారు. దేశంలో మొత్తం 10 లక్షల బస్సులు ఉంటే వీటిలో ఆర్‌టిసి బస్సులు 1,35,000 మాత్రమేనన్నారు. ఆర్‌టిసి బస్సుల ద్వారా వచ్చే కాలుష్యం అయితే ఇది ఇంకా చాలా తక్కువగా 0.07 శాతం మాత్రమే ఉంటుందన్నారు. ఇది అత్యంత తక్కువ. నిజంగా వాతావరణ కాలుష్యం తగ్గాలంటే వ్యక్తిగత వాహనాలకు స్వస్తి చెప్పి ప్రభుత్వం ప్రజా రవాణా ఆర్‌టిసిని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్‌టిసి చట్టం 1950 ప్రకారం ఆర్‌టిసి బస్సులకు బడ్జెట్ కేటాయింపులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేయడం లేదన్నారు. ఈ విషయాలపై చర్చించేందుకు ఈనెల 7న ఆర్‌టిసి హౌస్ విజయవాడలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యుత్ బస్సులపై సెమినార్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సెమినార్‌కు ఎక్కువ మంది హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

మాట్లాడుతున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర నాయకులు దివాకర్

'ఉయ్యాలవాడ నరసింహారెడ్డి' క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా సమితి 2025 నూతన సంవత్సర క్యాలెండరును ఆదివారం సేవా సమితి సభ్యులు ఆవిష్కరించారు. కర్నూలు కృష్ణనగర్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆ సంఘం గౌరవాధ్యక్షుడు జోగి వెంకటరామిరెడ్డి , డాక్టర్ కె వి సుబ్బారెడ్డి, అధ్యక్షుడు విజయ మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రతాప్ రెడ్డి, కార్పొరేటర్లు లక్ష్మీకాంత్ రెడ్డి, కైప పద్మలతాలు మాట్లాడారు. సేవాసమితిలో సభ్యుల నమోదు చేసుకోవాలని కోరారు. అసోసియేషన్‌కు కార్యాలయం ఏర్పాటుకు సహకరిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు వేణు గోపాలరెడ్డి, బి.శ్రీనివాసులురెడ్డి, రిటైర్డు ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, సువర్ణారెడ్డి రామచంద్రరెడ్డి, ప్రకాశరెడ్డి దివాకరరెడ్డి, నాగార్జునరెడ్డి, విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సమితి సభ్యులు

కలుషితనీటితో రోగాలు

ప్రజాశక్తి- పత్తికొండ : పత్తికొండ పట్టణంలోని కలుషిత నీటితో రోగాల భారినపడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టేట్ బ్యాంకు, లక్ష్మీ థియేటర్ వెనకవైపు ఉన్న కాలనీలలో కలుషిత నీరు సరఫరా కావడంతో తాగడానికి నీరు ఇబ్బందిగా ఉందని, పిల్లలకు స్నానం చేసినప్పుడు దురదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలని వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు స్పందించి ట్యాంకును శుభ్రం చేసి మంచినీటి సరఫరా చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు ఎక్కువ

- రాగ మయూరి బిల్డర్ కె జనార్దన్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్ : క్రీడల్లో రాణించే వారికి ఉద్యోగ అవకాశాలు ఎక్కువని రాగమయూరి బిల్డర్స్ కె.జనార్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎక్యాంప్ జోలాపురం రోడ్ తైక్వాండో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని , క్రమం తప్పకుండా రోజు సాధన చేయాలని , ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని స్పోర్ట్స్ కోటాలో 3 శాతం ఉందన్నారు. ఆత్మరక్షణ క్రీడలలో తైక్వాండో ఒక భాగమని అన్నారు. శిక్షకులు వెంకటేశ్వర్లు, టి.అజయ్, టి. తేజ, తైక్వాండో శిక్షకులు విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు మెడల్స్ అందజేసి అభినందిస్తున్న కె.జనార్దన్ రెడ్డి

శిథిలావస్థలో పశు వైద్యశాల

- పశు వైద్యశాల చుట్టూ ముళ్ళకంప చెట్లు - విష పాములు సంచారం

ప్రజాశక్తి-చిప్పగిరి

ప్రభుత్వ భవనాలు చాలా గ్రామాలలో శిథిలావస్థకు చేరుకున్నా వాటికి సంబంధించిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో పూర్తిగా నిరుపయోగంగా మారుతున్నాయి. ఆ భవనాలు చుట్టూ ముల్లకంపలు పెరగడంలో సంబంధించిన అధికారుల వ్యవహారంపై మండిపడుతున్నారు.

చిప్పగిరి మండలం నేమకల్లు గ్రామంలో దాదాపు 40 ఏళ్ల క్రితం నిర్మించిన పశు వైద్యశాల పూర్తిగా శిథిలావస్థకు చేరి, భవనం చుట్టూ ముళ్ళ చెట్లతో నిండి ఉన్నా కూడా ఏ అధికారులు పట్టించుకోవడంలేదు. శిథిలావస్థ కు చేరుకున్న భవనంలోకి విషపురుగులు తిరుగుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ వర్షాలు వచ్చినప్పుడు భవనంలో ఉన్న వైద్య పరికరాలు, ఔషధాలు చెడిపోయే ప్రమాదం ఉంది. పశు వైద్యశాల సరిగా లేకపోవడంతో పశువుల రైతులు పశు వైద్య అధికారులను మొబైల్ ద్వారా సంప్రదించి ఇంటి దగ్గరకు వెళ్లి పశువులకు వైద్య చికిత్స చేయించుకుంటున్నారు. శిథిలావస్థకు చేరుకున్న పశు వైద్యశాలను మరమ్మతులు

శిథిలా వస్తలో చిప్పగిరి మండలం నేమకల్లు పశువైద్యశాల

చేయించి, చుట్టూ ఉన్న ముళ్లకంపులను జెసిబి ద్వారా తీయించి భవనం చుట్టూ కాంపౌండ్ నిర్మించాలని సంబంధిత అధికారులను గ్రామ రైతులు కోరుతున్నారు.

బైపాస్ రోడ్డు పనులు పూర్తి చేయాలి : సిపిఎం

పనులు పరిశీలించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఆదోని

ఆదోని పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ఏర్పాటు చేస్తున్న నిర్మాణంలో ఉన్న ఆలూరు బైపాస్ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని సిపిఎం జిల్లా నాయకులు రామాంజనేయులు, వెంకటేశులు, సీనియర్ నాయకులు ఈరన్న, మహానందరెడ్డి, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, గోపాల్, తెలిపారు. నిర్మాణం జరుగుతున్న బైపాస్ రోడ్డు పనులను సిపిఎం నాయకత్వం ఆదివారం పరిశీలించింది. వారు మాట్లాడుతూ రోడ్డు ఇరుకుగా ఉండడం వల్ల భారీ వాహనాలు రాక సందర్భంగా రద్దీ ఏర్పడుతుందన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి నిర్మాణంలో ఉన్న ఆలూరు బైపాస్ రోడ్డు పనులు పూర్తి చేయడంలో అధికారులు, పాలకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. పనులు జరుగుతున్న సందర్భంలో అధికారుల పర్యవేక్షణ కచ్చితంగా ఉండాలన్నారు. ప్రభుత్వాలు మారడం సర్వసాధారణమని, ఆ ప్రభావం అభివృద్ధి పనులపై చూపరాదన్నారు. ఎన్నో ఏళ్లుగా హైవే రోడ్డు పనులు పూర్తి కావాలని

హైవేరోడ్డు పనులను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు రామాంజనేయులు తదితరులు

ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. మరింత వేగం పెంచి రోడ్డు నిర్మాణం పూర్తి చేసి వాడకంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ రోడ్డు రాకపోకలు అందుబాటులోకి వస్తే పట్టణం మరింత విస్తరించి అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. పాలకులు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, నిర్లక్ష్యం చేస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రేషన్ డీలర్ల ఎంపికకు నేడు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-ఆదోని

పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు సోమవారం డీలర్ల ఎంపిక కోసం ఇంటర్వ్యూ నిర్వహిస్తామని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. ఆదివారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అర్హత పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి అనంతరం వివరాలు వెల్లడించారు. హేతుబద్ధీకరణ ద్వారా నూతనంగా ఏర్పడిన చౌక ధరల దుకాణాలకు వివిధ రకాల కారణాలతో ఖాళీలు ఏర్పడిన 78 చౌక ధరల దుకాణాలకు శాశ్వత ప్రతిపాదకన డీలర్లను నియమించుటకు గతనెల 23న తేదీన నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. ఇందుకుగాను 512 అప్లికేషన్స్

రేషన్ డీలర్ల పరీక్షను పరిశీలిస్తున్న ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

వచ్చాయన్నారు. ఇందులో 472 అంగీకరించామని, 40 తిరస్కరించామని తెలిపారు. 472 మంది అభ్యర్థులకు ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రాత పరీక్ష నిర్వహించామన్నారు. ఈ పరీక్షకు 458 అభ్యర్థులు హాజరయ్యారన్నారు. పరీక్ష అనంతరం మూల్యాంకనం జరిపి ఉత్తీర్ణులైన వారిలో 1:5 నిష్పత్తి (రేషియో) లో ఈనెల ఆరున సోమవారం ఉదయం 9 గంటలకు ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. తదుపరి ఎన్నికైన వారికి చౌక ధరల దుకాణం కేటాయించేలా ఉత్తర్వులు ఇస్తామని తెలిపారు.

విద్యతోనే జీవితాలలో మార్పు

ఎస్ఐ బాల నరసింహులు

ప్రజాశక్తి -హోళగుంద

విద్యార్థి దశ విద్యతోనే ప్రతి ఒక్కరి జీవితాలు మార్పు చెందుతాయని ఎస్ఐ బాల నరసింహులు అన్నారు. ఆదివారం హోళగుందలో సమగ్ర శిక్ష అభియాన్ సహకారంతో ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ , వరలక్ష్మి సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు నిర్వహిస్తున్న సీజనల్ హాస్టల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరి జీవితాలు మారుతాయన్నారు. విద్య ఉంటే ఆరోగ్యంతో పాటు జీవనోపాధి దొరుకుతుందన్నారు. సమాజంలో మంచి వ్యక్తులుగా గుర్తింపు పొందడమే కాకుండా మంచి ఉద్యోగాలను పొందుతారన్నారు. మనకు ముందుగా ప్రతిదీ కష్టమే

మాట్లాడుతున్న ఎస్.బాలనరసింహులు

ఇష్టంతో చదివి పాఠశాలలకు, ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. సీజనల్ హాస్టల్ అనేవి జిల్లాలో కొద్ది గొప్ప ఉంటాయని, వాటిని తల్లిదండ్రులు వలసవెళ్లిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానిక సీజనల్ హాస్టల్ లో అన్ని వసతులు మంచిగా ఉన్నాయని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థిని విద్యార్థులతో ఎక్కాల టేబుల్స్ పలికించి మంచిగా విద్యార్థులు చెప్పడంతో ఆశ్చర్యానికి గురై విద్యార్థులకు నగుదుగా బహుమతి పంపిణీ చేశారు. అనంతరం ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ సహకారంతో విద్యార్థిని విద్యార్థులకు నోట్ బుక్స్ , పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ వ్యవస్థాపకులు సిహెచ్ నాగరాజు, ప్రతినిత్యం దినపత్రిక చీఫ్ బ్యూరో హెచ్ చలపతి. మండల పాత్రికేయులు నాగరాజ్‌గౌడ్, సంజయ్‌కుమార్, సీజనల్ హాస్టల్ ఉపాధ్యాయులు సోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-ఆదోని

చదువుతోపాటు క్రీడల్లో కూడా విద్యార్థులు ప్రతిభ చూపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు సూచించారు. ఆదోనిలోని మంత్రాలయం బిసి కళాశాల బాలికల హాస్టల్ ఆవరణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో క్రీడల పోటీలు నిర్వహించారు. క్రీడలను శ్రీనివాసులు ప్రారంభించి మాట్లాడారు. సంక్రాంతి పండగ సందర్భంగా ప్రతి ఏడాది విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వస్తున్నామన్నారు. విద్యార్థినులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటాపోటీగా ఆడి చివరికి సీనియర్ విద్యార్థులు ఈ కబడ్డీ పోటీలో విజేతలుగా నిలిచారు. విజేతలకు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు బహుమతి అందజేశారు. విద్యార్థులు సామాజిక అంశాలపై అవగాహన పెంచుకుని క్రీడల్లో చదువుల్లో పోరాటాల్లో భాగస్వాములుగా విద్యార్థులు కావాలన్నారు. విజ్ఞానవంతులైన విద్యార్థులు నేటి భారతవనిలో దేశ నిర్మాతలుగా ఎదగాలని, ఎస్ఎఫ్ఐ,డివైఎఫ్ఐ నిరంతరంగా కృషి చేస్తుందన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకు శ్రీనివాసులు, తదితరులు

కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు , శశిధర్ , పవన్ , సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా కార్యదర్శిగా బందేనవాజ్

కార్యకర్తల హర్షం

ప్రజాశక్తి- గోనెగండ్ల

వైసిపి మండల యూత్ నాయకుడు ఎంపిపి టి.నసీరుద్దీన్ తనయుడు టికె బందేనవాజ్ జిల్లా కార్యదర్శిగా ఎంపికైనట్లు ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు తెలిపారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కేంద్ర కార్యాలయం నుంచి సమాచారం అందడంతో ఆదివారం గోనెగండ్ల వైసిపి నాయకులు కార్యకర్తలు స్థానిక ఎంపిపి కార్యాలయంలో శాలువాలు పూలమాలలతో సన్మానించి అభినందనలు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ తమ నాయకునికి ఇంతటి అవకాశాన్ని కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి పార్టీ సమన్వయకర్త బుట్టా రేణుకకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బందే


బందేనవాజ్‌ను సన్మానిస్తున్న వైసిపి కార్యకర్తలు

నవాజ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంతటి బాధ్యతను ఉంచి జిల్లా కార్యదర్శిగా నియమించినందుకు పార్టీ అధినేత వైఎస్.జగన్మోహన్ రెడ్డి కి రుణపడి ఉంటానన్నారు. తనను ప్రోత్సహించిన బుట్టారేణుకకు కృతజ్ఞతలు తెలిపారు. మరింత ఉత్సాహంతో పార్టీ అభివృద్ధికి కష్టపడి పని చేస్తానన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పద్మనాభం , బగిలి ఉస్మాన్, చికెన్ రాజా, నదీముల్లా ,తిక్కయ్య, నాగేష్, నాగప్ప, హైదరాబాద్‌వలి, నగిరి మన్సూర్ ముల్లా, హుస్సేన్‌వలి,చింతపండు రహిమాన్, గౌస్, కొండల బందె నవాజ్, ముల్ల నబీరసూల్ పాల్గొన్నారు.

11న విజయవాడలో డిటిఎఫ్ ధర్నా

కరపత్రాలను విడుదల చేసిన నాయకులు

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

రాష్ట్రంలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న విద్యా, ఉపాధ్యాయ రంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 11న విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహిస్తున్నట్లు డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కరెకృష్ణ జిల్లా అధ్యక్షులు వెంకటరాముడు తెలిపారు. ఆదివారం డిటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో 117 ను పూర్తిగా రద్దు చేయాలన్నారు. అన్ని ఉపాధ్యాయ సంఘాలను

కరపత్రాలు విడుదల చేస్తున్న డిటిఎఫ్ నాయకులు

చర్చలకు ఆహ్వానించాలని, నూతన పిఆర్‌సి కమిటీని ఏర్పాటు చేసి 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. నెలవారి పదోన్నతులను చేపట్టాలని, ఉపాధ్యాయులకు జీతాలు వెంటనే చెల్లించాలని, పెండింగులో ఉన్న రెండు విడతల కరువుభత్యాన్ని మంజూరు చేయాలని, పిఆర్‌సి, డిఎ, మెడికల్ రిఅంబర్స్‌మెంట్, ఎపిజిఎల్ఐ, ప్రావిడెంట్ ఫండ్ బకాయిలను చెల్లించాలని, ఆంగ్ల మాధ్యమంతో సమాంతరంగా మాతృభాష మాధ్యమాలను కొనసాగించాలని, ఉపాధ్యాయులపై యాప్‌ల తగ్గించాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర కౌన్సిలర్ గోట్ల చంద్రశేఖర్, జిల్లా, మండల బాధ్యులు పాటిల్ ఈశ్వర్ రెడ్డి, జగదీష్, రవీంద్ర,వీరేష్, వెంకటాచలం, సోమశేఖర్, జయనంద్ పాల్గొన్నారు.

ఆధార్ స్పెషల్ డ్రైవ్ ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి- కౌతాళం : స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆధార్ స్పెషల్ డ్రైవ్ కేంద్రాన్ని సభ్యులు చేసుకోవాలని సర్పంచి పాల్‌దినకరన్ ఆదివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు కౌతాళం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా 0- 06 సంవత్సరాల పిల్లలకు కోసం ఆధార్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. చిన్న పిల్లల తల్లిదండ్రులు అందరూ వారి పిల్లల పుట్టిన తేదీ సర్టిఫికెట్లతో వెళ్లి , ఈ అవకాశమును పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-పెద్దకడబూరు : మండల పరిధిలోని దొడ్డిమేకలకు వైసిపికి చెందిన ఐదు కుటుంబాలు టిడిపి రాష్ట్రరైతు విభాగం అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. ఆదివారం ఆయన నివాసంలో వారికి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు చూసి దొడ్డిమేకల ఉరుకుంద, ఈరన్న, రామలింగ, వీరేష్, ముల్లాబాష వైసిపి నుంచి టిడిపిలో చేరినట్లు తెలిపారు. టిడిపి నాయకులు మల్లికార్జున, దొడ్డిమేకల నరసింహారెడ్డి, మీసేవా ఆంజనేయులు, ధర్మరాజు, అయ్యప్ప, జయరాం, పెద్దవీరేష్, తలారిఅంజి, రామాంజనేయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కార్పోరేటర్ చిత్రా సత్యనారాయణమ్మ

వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

కర్నూలు జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వివాహ పరిచయ వేదిక కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని కురువ సంఘం జిల్లా అధ్యక్షులు పత్తికొండ శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి ఎం.కె.రంగస్వామి, కార్పోరేటర్ చిత్రా సత్యనారాయణమ్మ అన్నారు. ఆదివారం కర్నూలు జడ్‌పి ఆవరణ లోని ఎంపిపి హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కురువ కులస్తులు తమ పిల్లల విషయంలో బ్రోకర్లను నమ్మి మోసపోకుండా సంఘం నిర్వహించే వివాహ పరిచయ వేదిక ద్వారా తమకు నచ్చిన సంబంధాలు ఉంటే కుదుర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ఏలూరు, కర్ణాటక, తెలంగాణ, కడప, అనంతపురం కురువలు హాజరయ్యారని తెలిపారు. జిల్లా గౌరవ అధ్యక్షులు కె.కిష్టన్న, జిల్లా ఉపాధ్యక్షులు కత్తి శంకర్, ధనుంజయ, సహాయ కార్యదర్శి కొత్తపల్లి దేవేంద్ర, కెసి.నాగన్న, పాల సుంకన్న, చంద్రశేఖర్ తిరుపాల్, నందకుమార్, దివాకర్, ఎల్లయ్య, పర్ల రమేష్, హనుమంతు పాల్గొన్నారు.


కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేస్తున్న భీమారెడ్డి

ఘనంగా భీమారెడ్డి జన్మదిన వేడుక

ప్రజాశక్తి- మంత్రాలయం

వైసిపి నాయకులు కార్యకర్తల మధ్య ఆ పార్టీ మండల అధ్యక్షులు జి భీమారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం భీమారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఆయన స్వగ్రామం 52 బసాపురం స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన కేకు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. చెట్నిహల్లి గ్రామ సర్పంచి అంజిని, ఉపసర్పంచి వీరనాగప్ప, ఎంపిటిసి సభ్యులు రామాంజనేయులు, నాయకులు గంగుల వెంకటేష్, కార్యకర్తలు ఆయనను కలిసి శాలువాలు, పూలమాలలు వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు కార్యకర్తలు ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

రజకులకు రక్షణ చట్టం అవసరం

-రజక కార్పొరేషన్‌కు రూ. వెయ్యి కోట్లు కేటాయించాలి

-ఐలమ్మ జయంతి సభలో నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రజకులకు రక్షణ చట్టంచేసి, రజక కార్పొరేషన్‌కు వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి.గురుశేఖర్, వృత్తిదారుల సంఘం నాయకులు జి. రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్మిక కర్షక భవనం దగ్గర ఐలమ్మ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం కర్నూలు జిల్లా 2025 నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం సంఘం జిల్లా అధ్యక్షుడు సి.ముక్కన్న అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వృత్తి సంఘాల నాయకుడు జి. రామకృష్ణ, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి. గురుశేఖర్, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్ బాబు , రజక వృత్తిదారుల గౌరవాధ్యక్షుడు సి.హనుమంతు, ఐలు జిల్లా కార్యదర్శి లక్ష్మన్న మాట్లాడారు. సావిత్రిబాయి పూలే జీవిత విశేషాలను మనమందరం తెలుసుకొని వారి సేవలను కొంతైనా రజక వృత్తిదారులకు ఉపయోగపడేలా మనం పని చేయాలన్నారు. ఆమె ఆదర్శం నేటి తరానికి స్ఫూర్తి దాయకంగా తీసుకోవాలని చెప్పారు. జిఒ నంబర్ 27 ప్రకారం వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న ధోబి పోస్టు భర్తీ చేసి రజక కుటుంబాల్లో ఉన్న యువతకు ఉపాధి కల్పించాలన్నారు. రజక కార్పొరేషన్‌కు కనీసం రూ.1000 కోట్లు కేటాయించి కార్పొరేషన్ ద్వారా 90 శాతం సబ్సిడీతో ప్రతి

మాట్లాడుతున్న రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి.గురుశేఖర్

రజక కుటుంబానికి రూ.5 లక్షల రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిటీ పట్టణ కేంద్రాల్లో మోడ్రన్ ధోబి ఘాట్లు ఏర్పాటు చేయాలని, జిఒ నెంబర్ 26 ప్రకారం కలెక్టర్లు చైర్మన్లుగా రజక సంక్షేమ కమిటీలు ఏర్పాటు చేసి రజకుల సమస్యలను చర్చించాలని కోరారు. కర్నూలు న్యూ సిటీ కార్యదర్శి శేషాద్రి ఓల్డ్ సిటీ కార్యదర్శి సిహెచ్ శ్రీనివాసులు మాట్లాడారు. రజక వృత్తిదారుల 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కర్నూలు అధ్యక్షులు సి. రాముడు, ఓల్డ్ సిటీ అధ్యక్షులు సి.జయమ్మ, ఆస్పరి ఈరన్న, నాగరాజు, కోటకొండ సూరి, గూడూరు రమేష్, ఎమ్మిగనూరు రంగస్వామి, రేమట అంజి. హుసేనాపురం శేఖర్, హరి, కర్నూలు నగర నాయకులు మద్దిలేటి, కర్రెన్న, రమణ, ఎల్లయ్య కురుమూర్తి,మహిళా నాయకురాలు ఈశ్వరమ్మ, పెద్దపద్మ, పాల్గొన్నారు.

డ్రైయినేజీ సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

డ్రైయినేజీ సమస్యను పరిష్కరించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని శ్రీరామ్ నగర్ సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు 23వ వార్డు శ్రీరామ నగర్‌లో ఆర్. నరసింహులు, సిపిఎం వార్డు శాఖకార్యదర్శి కెవి.జనార్ధన్ రావు వార్డు నాయకులు ఎస్.అజ్మత్, మద్దిలేటి, శ్రీనివాస్ యాదవ్, నరసింహ, రాజేష్‌ల బృందం వార్డులో సమస్యలను పరిశీలించింది. బృందానికి వార్డు ప్రజలు అనేక సమస్యలు తెలిపారు. నాగుల కట్ట లైను లో 49/50 ఎ-483 ఇంటి పక్కన ఉన్న ప్లాటు ఖాళీ స్థలం ఉండడం వలన ఈ స్థలంలో పందికొక్కులు విపరీతంగా గుంతలు తవ్వి నివాసం ఉంటూ డ్రెయినేజీ కాలువలోకి మట్టిని తవ్వుతూ కాల్వ మట్టితో నిండిపోయి రెండు రోజులకు ఒకసారి మట్టితో కాలువ నిండిపోతుందన్నారు. దీంతో డ్రైనేజీ వాటర్ నిలిచిపోయి దుర్గంధ వాసన వెదజల్లుతున్నదన్నారు. ప్రజలు అనారోగ్యాల బారినపడుతున్నారని, మున్సిపల్ అధికారులకు, స్థానిక

డ్రెయినేజీ పక్కన పందికొక్కులు తవ్విన ప్రదేశాన్ని చూపుతున్న నాయకులు

కార్పొరేటరుకు ఎన్నిసార్లు విన్నవించినా డ్రెయినేజీ సమస్యనుపరిష్కరించడం లేదని తెలిపారు. 49/50 ఎ-393 ఇంటి లైన్లో వేసిన సిసి రోడ్డు గత రెండు సంవత్సరాల కింద వేశారని తెలిపారు. ఈ సిసి రోడ్డు నాణ్యత లేకపోవడం వలన, కాంట్రాక్టర్, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వలన రోడ్డు గుంతలు పడి కంకర తేలి దయనీయంగా మారిందన్నారు. 15 సంవత్సరాల కిందట వేసిన సిసి రోడ్డు చెక్కుచెదరలేదని, అదే రోడ్డు పైన వేసిన సిసి రోడ్డు రెండు సంవత్సరాలకే శిథిలావస్థకు చేరుకోవడం చాలా దురదృష్టకరమన్నారు. కమిషన్లకు కక్కుర్తి పడిప్రజాధనాన్ని వృథా చేశారన్నారు. ఏడాదికేదాడి ప్రజల పైన పన్నులు భారాలు వేయడం మీద ఉన్నశ్రద్ధ నాసిరకంగా పనులుజరుగుతున్నప్పుడు పట్టించుకుని ఉంటే ప్రజాధనం వృథా అయి ఉండేది కాదన్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి డ్రెయినేజీ సమస్యను పరిష్కరించి ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా కాపాడాలన్నారు. నాసిరకం సిసి రోడ్లు వేసిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకొని వారి లైసెన్సులను ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రకాశం జిల్లాకు వలస పోతున్న కూలీల వాహనం

వలసలను ఆపండి

సిఐటియు , వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని మండలంలో వలసల పర్వం కొనసాగుతున్నా సంబంధిత ప్రజా ప్రతినిధులకు, అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, మండల కార్యదర్శి డి. రామాంజనేయులు, సిఐటియు మండల కార్యదర్శి బి. వీరారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం 5 బొలెరో వాహనాలలో మండలంలోని గణేకల్లు, బల్లెకల్లు, జాలిమంచి గ్రామాల నుండి దాదాపు 150 కుటుంబాలు ప్రకాశం జిల్లా దోర్నాల వలస వెళ్లారని తెలిపారు. గత మూడు రోజుల క్రితమే 150 కుటుంబాలు వలస వెళ్లారని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయక పోవడంతోనే కూలీలు వలసలకు కారణమని అన్నారు. మండలంలో సాగు నీరు ప్రాజెక్టు ద్వారా పంట పొలాలకు నీటి సౌకర్యం ఉంటే ఒక్కరు కూడా వలస వెళ్ళడానికి అవకాశం ఉండేది కాదని అన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ,ఎంత మంది ఎమ్మెల్యేలు వచ్చినా మాటలు మూటలే గాని ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించే ప్రయత్నం చేయడం లేదని అన్నారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ మండల నాయకులు వీరేష్ రామకృష్ణ పాల్గొన్నారు.

IN THE COURT OF THE II ADDL, DISTRICT JUDGE KURNOOL AT ADONI
O.S. No.2/2024
I.A.No.11/2024 & I.A.No.12/2024 in O.S.No.2/2024

Yesa Jayakrishna Murthy & Another.
...Plaintiffs/Petitioners
Vs
M. Ashok Kumar & others
...Defendants/Respondents

SUIT SUMMONS & NOTICES TO THE DEFENDANTS

To
D.4: K. Shirisha Kumari D/o K. Chittibabu, H.No.11-4-46, Radhalapeta, Pitapuram town, Kakinada Dist. Cell No.9347299958
D.9: Sirisala Chaitanya Kumar S/o Late S. Krishna Murthy, H.No.1/2138-2, Weavers colony, Yemmiganur town, Kurnool Dist.
D.10: Gadwala Sai Chandana D/o Gadwala Panduranga H.No.1/2256, Weavers colony, Yemmiganur town, Kurnool Dist.

Whereas the plaintiff has instituted a suit against you for cancellation of Registered sale deeds and for permanent injunction. The plaintiffs also filed petition for grant of Ad Interim Injunction restraining you from alienating the petition schedule properties and not to interfere with the peaceful possession and enjoyment of the petition schedule property. Hence you are hereby required to appear before this court On 05.02.2025 at 10.30 AM in person or through an advocate and answer the said suit and petitions, failing which the matter will be decided in your absence.

(By Court Order)
Sri. D. Mallikarjuna, B.Com B.L., Advocate, Yemmiganur , Kurnool Dist.